క్లుప్తంగా

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుడివాడ అమర్‌నాథ్

గాజువాక: ఆలిండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 2న నిర్వహించనున్న రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ సోమవారం ఆవిష్కరించారు. గాంధీ జయంతి సందర్భంగా పాతగాజువాక జంక్షన్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరంతో పాటు కంటి, దంత, బీపీ, సుగర్, చెవి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు జాగరపు శ్రీను తెలిపారు. కార్యక్రమంలో 69వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్లు తాత్కాలికంగా మూత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో ఉన్న పలు క్యాంటీన్లు తాత్కాలికంగా మూతపడనున్నాయి. ఎల్‌ఎంఎంఎం, వైర్ రాడ్ మిల్-1, ఎంఎంఎస్‌ఎం, బీఎఫ్, సింటర్ ప్లాంట్, టీపీపీ, కోక్‌ఓవెన్స్ 1,2 క్యాంటీన్లు మంగళవారం నుంచి పని చేయవు. అనివార్య కారణాల వల్ల క్యాంటీన్లు పని చేయవని.. ఉద్యోగులు సొంత ఏర్పాట్లు చేసుకోవాలని స్టీల్‌ప్లాంట్ (హెచ్‌ఆర్) క్యాంటీన్ సెక్షన్ అధికారులు విజ్ఞప్తి చేశారు.కాగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడం వల్లే క్యాంటీన్లు మూత పడే పరిస్థితి వచ్చిందని క్యాంటీన్ కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు.

కార్యదీక్షాపరుడు నాగేశ్వరరావు



నాగేశ్వరరావును సత్కరిస్తున్న అక్కిరెడ్డిపాలెం ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో రికార్డ్ అసిస్టెంట్ నామా నాగేశ్వరరావుకు అనకాపల్లి జిల్లా వెలుపర్తి జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ కావడంతో సోమవారం ఆయన్ను ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం మాట్లాడుతూ నాగేశ్వరరావు స్కూల్లో నిబద్ధతతో సేవలందించారని, కార్యదీక్షాపరుడు అని కొనియాడారు.

వాసవీ సేవా ట్రస్టు సభ్యులకు సత్కారం



సభ్యులను సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు


గాజువాక: వాసవీ సేవా ట్రస్టు సేవలకు సహకరిస్తున్న ఇద్దరు సభ్యులను ఆ సంస్థ ప్రతినిధులు సత్కరించారు. త్వరలో నిర్మించనున్న వృద్ధాశ్రమం, అనాథాశ్రమ పనులకు సంబంధించి చర్చించడానికి సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు బండి రాజశేఖర్, కందుల సాయిని సత్కరించారు. భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు నంబూరి జగన్నాథరావు, కులుకూరి మంగరాజు, కేసారపు శ్రీను రమేష్, గుండా శరత్‌చంద్ర గుప్త, కేసారపు సతీష్, సింగంశెట్టి సతీష్ కుమార్, కోట పెద వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు కమిటీ ఏర్పాటు

ఉక్కునగరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి ఏడుగురు సభ్యులతో స్టీల్‌ప్లాంట్ మాలల కమిటీ ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య అధ్యక్షతన సోమవారం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పి. రాజ్‌కుమార్, కె. రామకృష్ణ, సుధీర్ రాజు, బిరుదుగడ్డ అరవింద్ కుమార్ జి. ఫణీంద్రబాబు, కె.వి. సురేష్, యాదల అనిల్‌కుమార్‌లతో కమిటీ నియమించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా...

సర్కారు బడిలో డైరీ



నడుపూరు పాఠశాలలో మూడు రకాల క్యూఆర్ కోడ్స్‌తో రూపొందించిన డైరీ

- వివిధ అంశాలు, క్యూఆర్ కోడ్‌తో రూపకల్పన
- నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవ

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పోటీపడుతోంది. ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవతో చక్కటి ఫలితాలు సాధిస్తోంది. ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైన డైరీ కల్చర్‌ను ఇప్పుడు పాఠశాలలో అమలు చేస్తున్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించే విధంగా డైరీని రూపొందించారు. ప్రత్యేక ఫీచర్స్‌తో తయారు చేశారు. ఈ డైరీని ఇటీవలఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు.

మూడు రకాల క్యూఆర్ కోడ్స్‌తో..

డైరీ కవర్ పేజీలో మూడు రకాల క్యూర్ ఆర్ కోడ్స్ రూపొందించారు. ఆ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే ఫేస్ బుక్, యూట్యూబ్ ఓపెన్ అవుతాయి. అలాగే ఏ రోజు పాఠాలను ఆరోజు డిజిటల్ రూపంలో పొందుపరుస్తారు. పాఠశాలకు సంబంధించి మూడు సంవత్సరాల సంపూర్ణ సమాచారాన్ని వివిధ రూపాల్లో తయారు చేసి అందుబాటులో ఉంచారు. యూట్యూబ్ చానల్, పాఠశాలకు సంబంధించిన ఫేస్ బుక్ పేజీలను ప్రత్యేకంగా వీక్షించవచ్చు. మూడేళ్లుగా అకడమిక్ పరంగా సాధించిన విజయాలను డైరీలో ముద్రించి విద్యార్థులకు అందించారు.

స్కాలర్‌షిప్ సాధనలో హ్యాట్రిక్..

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్‌ఎంఎంఎస్) స్కాలర్ షిప్ పరీక్షలో జిల్లా స్థాయిలో ఈ పాఠశాల వరుసగా మూడేళ్ల పాటు ప్రథమ స్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించింది. స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థుల ఫొటోలను డైరీలో ముద్రించారు. అలాగే గతేడాది 19 మంది, ఈ ఏడాది 27 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ సాధించడంతో వారికి డైరీలో స్థానం కల్పించారు.



డైరీలతో విద్యార్థులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు డైరీలో చోటు

అలాగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలు కూడా పొందుపర్చారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు అందించిన రూ.2.37లక్షల వివరాలను, పాఠశాల అభివృద్ధి నిధికి తల్లిదండ్రులు అందించిన విరాళాలను కూడా ఇందులో పొందుపర్చారు. డైరీ రెండో పేజీలో విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలను దూరంగా ఉండాలంటూ ఇచ్చిన కొటేషన్ ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

నాడు-నేడుతో మారిన రూపురేఖలు

గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులతో పాఠశాల రూపురేఖలు మారాయి. చేపట్టిన పనుల వివరాలను కూడా అందుబాటులో ఉంచారు. అలాగే ఎల్‌అండ్‌టీ సంస్థ మౌలిక సదుపాయాల కోసం అందించిన రూ.కోటి వివరాలు కూడా పొందుపర్చారు.

అందుబాటులో ఫోన్ నంబర్లు..

పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో పాటు విద్యాశాఖాధికారుల ఫోన్ నంబర్లను డైరీలో పొందుపర్చారు.

మాకూ డైరీ ఉంది



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నాకు డైరీ ఇచ్చి మా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. ఎంతో విలువైన సమాచారం ఉంది. ప్రతి రోజూ నేను స్కూల్‌లో విన్న పాఠాలు మళ్లీ ఇంటి వద్ద చదువుకునేందుకు అనువుగా క్యూఆర్ కోడ్స్ ఉన్నాయి. ఇవి మాకు ఎంతో ఉపయోగకరం.

– హాసిని, పదో తరగతి

విలువైన సమాచారం



స్కూల్‌లో మాకు ఇచ్చిన డైరీలో విలువైన సమాచారం ఉంది. ప్రతిభ గల విద్యార్థులు, స్కాలర్ షిప్‌లు సాధించిన విద్యార్థుల ఫొటోలను ముద్రించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని నేను కూడా కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తాను. నేను డైరీలో నిలిచేలా చదువుతాను.

– నిహారిక, పదో తరగతి

ప్రగతిని చూశాం



మూడేళ్లుగా పాఠశాల జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో సాధించిన ప్రగతిని డైరీలో మైల్ స్టోన్స్ అనే పేజీలో ముద్రించడం ద్వారా పాఠశాల ప్రగతిని చూశాం. నా కుమార్తె కూడా ఈ పాఠశాలలో చదువుతోంది. గతంలో విజయాలు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని చదివిస్తాను. మంచి పాఠశాలలో నా కుమార్తె చదువుతుందని సంతోషంగా ఉంది.

– కె.పుష్పాంజలి, విద్యార్థిని తల్లి

గర్వపడేలా డైరీ



ప్రైవేటు పాఠశాలలకు దీటుగా డైరీ రూపొందించారు. అందులోని అనేక అంశాలు, అభివృద్ధి, సాధించిన ప్రగతి చూస్తే ఎంతో గర్వంగా ఉంది. గతంలో ఈ పాఠశాల విద్యార్థులు సాధించిన ఫలితాలను ఆదర్శంగా తీసుకున్నాను. వారి స్ఫూర్తితో స్కాలర్‌షిప్ సాధించాను. డైరీలో నా ఫొటో చూస్తే నాకే గర్వంగా ఉంది.

– ఎస్.అభినాష్, 8వ తరగతి

డైరీ ఉపయుక్తం



పాఠశాలలో ఏం చెబుతున్నారో.. నా కుమారుడు ఎలా చదువుతున్నాడో ఈ డైరీ ద్వారా నాకు తెలుస్తుంది. దాని ప్రకారం నా కుమారుడికి చదువులో శిక్షణ ఇస్తాను. మంచి ఫలితాలు సాధించేలా తయారు చేస్తాను. ఉపాధ్యాయుల ఫోన్ నెంబర్లు కూడా ఉండడంతో వారితో నా కుమారుడి గురించి మాట్లాడే అవకాశం ఉంది.

– ఎస్.జ్యోతి, విద్యార్థి తల్లి

కొత్త సంప్రదాయం



ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే డైరీ కల్చర్ ఉంది. దాన్ని ఇప్పుడు మా పాఠశాలలో అమలు చేస్తున్నాం. దీని వల్ల విద్యార్థుల చదువుతున్న తీరుపై తల్లిదండ్రులకు అవగాహన ఏర్పడుతుంది. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా డైరీని తీర్చిదిద్దాం. భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించేందుకు డైరీ ఉపయోగపడుతుంది. దీనికి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

– రాచకొండ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సెయిల్‌లో విలీనంతో ఉక్కు మనుగడ



మాట్లాడుతున్న ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సెయిల్‌లో విలీనం చేసి ఉక్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకుడు జె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం వద్ద 1327లుగా రిలే దీక్షలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ.పదివేల కోట్లు చెల్లించాలని కోరారు. ఉక్కు పరిరక్షణ కోసం మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. 2న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో పెద్ద ఎత్తున దీక్షలు నిర్వహిస్తామని, 3న రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. నాయకులు మసేన్‌రావు, కె.రాజబాబు, డి.దేముడు, సీతారామరాజు, ఆర్.ధనరాజు, రాజేశ్వరరావు, మోహన్‌కుమార్, కర్రి బాబూరావు, దాసరి శ్రీనివాస్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎల్‌ఎంఎం, డబ్ల్యూఆర్‌ఎం, ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టీఎం, ఎస్‌బీఎం, ఆర్‌ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి



సత్యాగ్రహ దీక్ష కరపత్రం ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 2న నిర్వహించనున్న ఉక్కు సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని పోరాట కమిటీ నాయకులు కోరారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సెంట్రల్ స్టోర్స్ వద్ద సత్యాగ్రహ దీక్ష కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. అదే విధంగా ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు ఇవ్వాలన్నారు. బుధవారం కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే సత్యాగ్రహ దీక్షలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, జె.రామకృష్ణ, జెర్రిపోతుల ముత్యాలు, కామేశ్వరరావు, రామ్‌కుమార్, గణపతిరెడ్డి, కాంగ్రెస్‌గుల శ్రీనివాస నాయుడు, నరేంద్ర కుమార్, నమ్మి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్‌పై విద్యార్థులకు అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్‌పై స్థానిక చైతన్య మహిళా కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడారు. స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాలను వివరించారు. పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, పోషణ అభియాన్, ఇంద్రధనస్సు, బేటీ పఢావో, బేటీ బచావో వంటి అనేక కార్యక్రమాలను ఈ మిషన్‌లో పొందుపరిచారన్నారు. విద్యార్థులు నివసిస్తున్న గ్రామ పరిసరాలు, కళాశాల పరిసరాల శుభ్రతకు స్వచ్ఛందంగా సేవ చేయాలన్నారు. స్వచ్ఛభారత్ అమలుపై ఈ సందర్భంగా విద్యార్థులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏడు ఆకుల చెట్లు తొలగించాలని వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: వాయు కాలుష్యానికి కారణమైన, భూగర్భ జలాలను అధికంగా పీల్చే ఏడు ఆకుల చెట్లను తొలగించాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి సోమవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏడు ఆకుల చెట్ల నుంచి విడుదలయ్యే గాలి పీల్చడం వల్ల మానవులకు శ్వాసకోశ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వివరించారు. ఈ చెట్లు భూగర్భ జలాలను అధికంగా పీల్చడం వల్ల భూగర్భ జలాల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. వెంటనే జీవీఎంసీ పరిధిలో ఈ చెట్లను తొలగించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విజ్ఞాన్ విద్యార్థులు

అగనంపూడి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. అండర్-20 విభాగంలో పి.సాయితేజ, కె.మొనాలి, ప్రణవశ్రీ ఎంపికయ్యారని చెప్పారు. వీరు వచ్చేనెల 4 నుంచి మూడు రోజుల పాటు రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీన్ బి.సతీష్, ఫిజికల్ డైరెక్టర్లు సీహెచ్. రాంబాబు, జె.ప్రశాంత్, పీఎస్‌వీ రమణ, ఎ.భారతి పాల్గొన్నారు.

టెట్ కేంద్రం పరిశీలన



ఎస్‌వీఎస్ టెక్నాలజీ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

పెదగంట్యాడ: ఈ నెల 3 నుంచి 20 వరకూ వికాస్‌నగర్ జంక్షన్‌లోని ఎస్‌వీఎస్ టెక్నాలజీ సెంటర్‌లో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కేంద్రాన్ని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని సెంటర్ యాజమాన్యానికి సూచించారు. కంప్యూటర్లన్నీ బాగా పని చేస్తున్నాయో లేదో ముందుగానే సరి చూసుకోవాలని చెప్పారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆమె వెంట పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారి కె.రమణాజీ ఉన్నారు.

గంజాయి కేసులో నిందితుడి పరార్

ఆలస్యంగా వెలుగులోకి

అగనంపూడి: గంజాయి కేసులో నిందితుడు దువ్వాడ పోలీస్‌స్టేషన్ నుంచి పరారయ్యాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ముందస్తు సమాచారం మేరకు ఈ నెల 28న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఏఎస్‌ఆర్ జిల్లా పెదబయిలుకు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 21 కేజీల గంజాయితో పాట ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని దువ్వాడ పోలీసులకు అప్పగించారు. ఇద్దరిలో ఒకరు మైనర్ కాగా, మరో నిందితుడు అరడా శివ కుమార్ చేతికి సంకెళ్లు వేశారు. శివకుమార్ సన్నంగా, పొట్టిగా ఉండడంతో 28వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత చేతికి వేసిన బేడీలు జారవిడుచుకొని తప్పించుకొని పారిపోయాడు. పోలీసులు అప్రమత్తమై నిందితుడిని వెంబడించినప్పటికీ ఫలితం దక్కలేదు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నప్పటికీ ఆచూకీ కాలేదు. కాగా మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

అగనంపూడి: కూలి పని దొరక్క, మద్యానికి బానిసైన వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాళికి చెందిన ఎస్. నీలయ్య (45) భార్య జయలక్ష్మి ఇద్దరు కుమార్తెలతో కలిసి అగనంపూడి నిర్వాసితకాలనీ దొంకాడలో నివాసముంటున్నారు. పరవాడ ఫార్మాసిటీలో కూలి పనులు చేసుకుంటున్న నీలయ్య మద్యానికి బానిసగా మారాడు. దీంతో పాటు చేయడానికి పని దొరక్క మనస్తాపానికి గురై మద్యం మత్తులో సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు కాగా ఒక అమ్మాయికి వివాహం జరగ్గా, మరో కుమార్తె ఇంటర్ చదువుతోంది.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి పూర్తిచేసి 15 నుంచి 45 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9133242666 నంబర్‌లో సంప్రదించవచ్చు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ స్ఫూర్తితో నిర్వహిస్తున్న సిద్ధేశ్వరం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ ఐపీఎల్ వచ్చిన తర్వాత క్రీడాకారులకు అవకాశాలు కూడా లభిస్తున్నాయని తెలిపారు. గాజువాక ప్రాంతానికి చెందిన నితీష్‌రెడ్డి ఐపీఎల్‌లో సత్తా చాటి టీమిండియాలో చోటు సంపాదించాడని గుర్తు చేశారు. క్రీడాకారులు తమ ప్రతిభకు పదును పెట్టుకోవడానికి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ఇటువంటి టోర్నమెంట్లు దోహదం చేస్తాయని చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ ఉపకరణాలు దగ్ధం



షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయిన సామగ్రిని పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ దిబ్బపాలెంలో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక ఇంట్లో విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. బాధితులు చిప్పాడ నూకరాజు, సత్యవతి దంపతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి భోజనాలు ముగించుకొని నిద్ర పోతున్న సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో భయంతో కేకలు వేసుకొని బయటకు వెళ్లిపోయారు. ఆ సమయంలో యలమంచిలి కనకారావు అనే వ్యక్తి గమనించి సర్వీస్ వైర్‌ను స్తంభం నుంచి తొలగించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని వారు తెలిపారు. ఇంట్లో రిఫ్రిజిరేటర్, ఇతర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయని ఆవేదన చెందారు. సచివాలయ అడ్మిన్ దిలీప్ సంఘటనా స్థలానికి చేరుకొని నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించారు. బాధితులను స్థానిక నాయకులు కర్రి దేశేంద్ర, యలమంచిలి అప్పారావు, ఈగల నరసింగరావు, శీరంశెట్టి బాబ్జి, పోలినాయుడు, వెంకటరావు, రాజు పరామర్శించారు.

76 మందికి కొలువులు



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ప్రతినిధులు

పెదగంట్యాడ: దివ్యాంగులు, మహిళలకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయడం అభినందనీయమని 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, కేఎన్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ట్రిన్ ట్రస్ట్ అఖిల భారత మేనేజర్ ప్రియ రంజన్ ఆధ్వర్యంలో 64వ వార్డు గొడ్డువానిపాలెం పాఠశాల ఆవరణలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు, మహిళలకు అపోలో, అమెజాన్ వంటి సంస్థల్లో ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. అనంతరం అర్హత ఉన్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మేళాలో 76 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కల్చర్ ఫౌండేషన్ చైర్మన్ పేర్ల అప్పారావు, సురేష్, ప్రవీణ్, అమరేంద్ర, జీలకర్ర భువనేశ్వరి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

హిందీ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



విజేతలతో హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్

పెదగంట్యాడ: ప్రపంచ హిందీ దినోత్సవం సందర్భంగా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం గాజువాక ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు హిందీపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జూనియర్ విభాగంలో కవితా పఠనంలో ప్రథమ స్థానంలో, వ్యాస రచనలో తృతీయ బహుమతులు గెలుపొందారు. సీనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి గెలుపొందారు. విజేతలైన విద్యార్థులతో పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన హిందీ ఉపాధ్యాలు నారాయణరావు, రజని, శాంతికుమారిలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అభినందించారు.